# కాళిదాసుని అపకీర్తి

(ప్రబుద్ధాంధ్ర : 1936)

నైమిత్తిక ప్రళయం అయిపోవడంతోనే నూతన బ్రహ్మ నిశ్వాసాలు బయలుదేరినై. ధర్మదేవత తనమూర్తి తాను చూచుకుంది. నిత్యమై సహజమై తన సృష్టిని ఒక కాలంలో మూర్ఖులు గ్రథిత మనుకొంటారని తలచింది. ఆ భావంలో స్వకీయ తేజోవికారమయినదిన్నీ భావిష్యత్క మయినదిన్నీ అయిన కవితామూర్తి మీద ఆమె మనస్సు పారింది. ఆ మూర్తి తన చుట్టూ ఒక దివ్యతేజస్సు, ఒక దివ్యలోకము కల్పించుకుంది. ఆ లోకంలో నొక తేజోరాశి భాసించాడు. ఆయన కాళిదాసు. అతని వాక్కులో నుండి యొక యశోరేఖ బయలుదేరి మూడు లోకాలని తన శుభ్రజ్యోత్స్నలో ముంచి యెత్తుతోంది. ధర్మదేవత పరకాయించి చూచింది. అంతటి ప్రభారాశిలో ఒక నువ్వుగింజంత నలుపు కనిపించింది. దాని మూర్తి ఏకదేశమందు ఏకకాలమందే కనిపించింది.

బ్రహ్మనిశ్వాసాలు సుళ్ళు తిరిగి ఋక్కులైనాయి. యజస్సులైనాయి. సామలైనాయి.

త్రేతాదిలో వాల్మీకి ఋషి ముఖ కమలంలో నుండి నూతనచ్ఛందోవతారం కలిగింది. నిత్యమైన తన నిశ్వాసాలల్లో కొంత సారూప్యం తెచ్చుకున్న యీ మనుష్యులలో ప్రథమమై శబ్దబ్రహ్మ వివరాన్ని చూస్తే బ్రహ్మకి మళ్ళీ కాళిదాసుని యశోమూర్తి జ్ఞాపకం వచ్చింది. బ్రహ్మ వాల్మీకుల ఆర్షమైన చక్షుస్సులు రెండూ పరిశీలించినై. ఆ నల్లని మచ్చ అల్లాగే వుంది.

సమ మధురోవ నతార్థవాక్యబద్ధమైన రామచరితం సాగింది.

ద్వాపరాంతంలో వ్యాసులు అవతరించారు. ఆయన రచనలకి అంతూ పంతూ లేకపోయింది. వేదాలు విభాగించాడు. పద్దెనిమిది పురాణాలు వ్రాశాడు. బ్రహ్మసూత్రాలు వ్రాశాడు. భారతం కావ్యం కట్టాడు. ఇంతచేసీ తన కవితాశక్తి అసంపూర్ణ మనుకొని భవిష్యత్తులో చూశాడు. మహాకవి కాళిదాసు గోచరించాడు. ఆయన యశస్సు త్రిలోకాలల్లో, త్రికాలాల్లో, దేదీప్యమానంగా వెలిగిపోతూంది. కాని ఏదో ఒక చిన్న మచ్చ మాత్రం కనిపిస్తూనే ఉంది.

పుడతాడు పుడతాడు అనుకొన్న మహాకవి కలి ప్రవేశించిన మూడువేల యేళ్ళకు గాని పుట్టలేదు. ఆ ప్రభువు పుట్టటంతోటే వ్యంగ్యలోకాల్లో ధ్వనిలోకాల్లో మోట్టా యితాలు కలిగినై.

ఆ కవి పుట్టిన అగ్రహారంలో ఇంధనాలకి యజుస్సులు వచ్చు. వాసాలకి సామలువచ్చు. గోడలకూ, దూలాలకూ తర్కం వచ్చు. ఇళ్ళల్లో ఈగలకు ధర్మశాస్త్రాలు తెలుసు. రజ్జువులకు వేదాంతాలు తెలుసు.

శిల్పమన్న పేరు పెట్టుకొని కవిత్వం దర్మోల్లంఘన చేయలేదప్పటి కింకా, ఆరుశాస్త్రాలు చదివినా, నాల్గు వేదాలు చదివినా, ఆచరించినా, ఋగ్యజుస్సామలకు కదిలె శిరస్సులు కాళిదాసు ఋతుసంహార శ్లోకాలకు కదలలేదు, సరికదా కదులుతై అని కూడా అనిపించలేదు. కుమారసంభవం వచ్చింది. కాశ్మీరంలో పరిషత్తులు పులకరించినై. దక్షిణాపథంలో పంచవన్నెల చిలకలు కంఠతా పట్టినై. రసప్రపంచకాలల్లో రాపిళ్ళైక్కువై పింపిళ్ళు కూసినై.

కాని అగ్రహారం తొణకలేదు. బెణకలేదు.

మేఘదూతం వచ్చింది. అదివఱకు దారితెన్ను తెలియని మొగిలితేండ్లు సుఖంగా దారి తెలుసుక బయలుదేరారు. దాని దివ్యసంచారాలకు దిజ్నాగులు తొలిగి దారి యిచ్చారు. మధురభారతి ఒయ్యారాలు పోయి సిగ్గు లొలికించింది. ఆసేతు హిమాచలం రసమేఘం రంగురంగుల నడకలు నడచి, సమార్ద్రము కాని క్షేత్రమే లేకపోయింది.

కాని అగ్రహారం మీద బొట్టు పడలేదు. వాన వస్తుందనైనా ఒక్క దుర్దుర మంటే ఒక్క దుర్దురమైనా కూసిందా? కూయలేదు.

రఘువంశం వచ్చింది. అదివఱకల్లా నేను కావ్యాన్ని, నేను కావ్యాన్ని అన్న సంస్కృత రామాయణం బ్రహ్మసూత్రాలకి మల్లే, ఉపనిషత్తులకి మల్లే, అయి వశిష్ఠులు రామచంద్రులకు దోవయిచ్చినట్లు యిచ్చింది.

మహాకవి విక్రమార్కుని సభలో అర్థసింహాసనారూఢుడైనాడు. మాళవిక నృత్యం చేసింది. చేస్తే ఆవిడ శరీరావయవాలన్నీ నక్షత్రాలల్లే మెరసినై. మహాకవికి పాతికేళ్ళు నిండలేదు. ఆయన ముగ్ధభావంలో మాళవిక సర్వావయవసుందరి

అయింది. భాసుని యాత్మ అనుకుంది "ఇతను పుట్టాడు. నాకు త్రవ్వి బయటకు తియ్యాలిసిన అవస్థ పట్టిస్తాడు."

రాజాంతఃపురము తెరచాటున కిలకిలా నవ్వింది. విక్రమార్కుడు చతురాంతః పురవధూ ప్రసాదన రసికుడైనాడు.

మహాకవి బంగారు సేలువ వాడు, సింహతలాటాల మురుగులవాడు, రత్నహారములవాడు, బోయీలు మోచిన పల్లకీ మీద నగ్రహారము చూడబోయినాడు.

అగ్రహారము నిత్య కర్మలయందు నిమగ్నమై యున్నది. మహాకవి వైభవమునకు అగ్రహారము నివ్వెఱకూడ భజించలేదు.

కవి ప్రౌఢుడైనాడు. అతని కూర్వశి కనిపించినది. ఆమె సౌందర్య మంతయు నామె యురోజకాఠిన్యము నందే కనిపించినది. ఆమె వియోగ కటునిశ్వాసాలవల్ల ఆమె యెదుఱొమ్ము లేచుచు పడుచుచు నున్నది. కాళిదాసుకి సౌందర్యపిపాస చేత నున్మాద మెక్కింది. ఏమి యున్మాదము? ఉన్మాదావస్థలో నాట్యము నృత్యమైనది.

ధ్వని లోకాలలో పరిణాహము చాలలేదు. రసవీధులలో విస్తృతి పట్టలేదు.

మహాకవి తన జన్మస్థలమయిన యగ్రహారము వంక దిరిగి చూడలేదు. అగ్రహారము మహాకవికి వంది మాగధ ప్రాయమైన లోకమును అవగతబుద్ధి యన్నది. ఖద్యోతుని, లింగభేదము తోడి మిరుగుడుపురు వన్నది.

మహాకవి కేబదియేళ్ళు వచ్చినై. కవి శకుంతలా రూపమును ధ్యానించాడు. భాషాదేవివంక చూచాడు. ఆమె తన శబ్ద స్వరూపాన్ని కుంచించుకు వచ్చింది. ఆమె శరీరము చుట్టును కనపడీ కనపడని జ్యోతిస్సులు వెలిగినై. ఆయమ మూర్తి శబ్దాన్ని దాటి, వ్యంగ్యాన్ని దాటి, ధ్వనిని దాటి, రసాన్ని దాటి, యానంద వీధుల్లో భాసాభాసమైన బ్రహ్మ పదార్థమల్లే గోచరించింది. ప్రభువు శకుంతలను చూచాడు. ముగ్ధయైన మాళవికలో మల్లే ఆమె యందు ప్రత్యవయవ శోభ చూడలేదు. ప్రౌఢయైన యూర్వశియందు మల్లే వక్షోజ కాఠిన్యం చూడలేదు. సర్వసంసారము యొక్క సారము, భావమొకటే యామె కన్నులయందు చూచాడు. ఆమె స్త్రీగా లేదు. అఖండమై పుణ్యముల ఫలముగా మాత్రమే గోచరించింది.

దానితో వేదాలకు పౌరుష్యం పోయింది. ఉపనిషత్తులలో క్లిష్టత్వం తగ్గింది. ఋక్ఛందస్సులు వచ్చి ఆర్యులతో చేదోడుగా వాదోడుగా మెలగినై.

ఆనందభాష్పములు కురిసినై

సాత్త్వికోదయం నిత్యమైన విషయం అయింది.

అగ్రహారం యథావిధి తన కర్మలు తాను చేసుకుంది. సులభంగా సాధించే ఆనందాన్ని బహుజన్మలచేత సాధిస్తానంది.

కాళిదాసు దివ్యశరీరంతో వాఙ్మయలోకాల్లో తిరుగుతున్నాడు. మూడు లోకాల్లో, మూడు కాలాల్లో అతని కీర్తి తెల్లగా వెలుగుతోంది. మచ్చ వాడిపోయింది. కాని అక్కడే వుంది. అది అగ్రహారమల్లే చాయగా కనిపించింది. అగ్నిహోత్రపు పొగలేశమల్లే అల్లా అల్లా తోచింది. ఈర్ష్యాగ్రస్తమై, అవిచారమై, మూఢమై, అరసజ్ఞమైన బుద్ధికిమల్లే కళావిహీనమై కనిపించింది.

జగన్నాథుడైన కాళిదాసు ఆత్మ బ్రహ్మరథ మెక్కి తిరుగుతోంది.

బ్రహ్మ, వాల్మీకి, వ్యాసుదు, కాళిదాసు నలువురు నాల్గు యుగాలకు వాఙ్మయలోకాలకు బ్రహ్మలైనారు. భవభూతి వారున్న యెడకు వెళ్ళాడు. వాల్మీకి కాళిదాసులు తమలో ఆయన్ని కలుపుకున్నారు.

మూడు లోకాలమీద నాల్గు యుగాలు మళ్ళీ తిరిగినై. వెలుగుతో నిండిపోయినై లోకాలు, కాలాలు! మచ్చ మచ్చగానే వుంది!